### ఘనంగా లోకమాత
## రాణి అహల్యాభాయి జయంతి




ఇంద్రప్రస్థ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన లోకమాత రాణి అహల్యాభాయి జయంతిలో పాల్గొన్న మహిళలు

మన్సూరాబాద్, మే 31: లోకమాత రాణి అహల్యా భాయి 300వ జయంతిని సామాజిక కార్యకర్త లయ కాలంశెట్టి ఆధ్వర్యంలో శనివారం నాగోల్ డివిజన్ పరిధి ఇంద్రప్రస్థ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. లోకమాత రాణి అహల్యాభాయికి హారతి వందనమిస్తూ కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా లయ కాలంశెట్టి మాట్లాడుతూ, రాణి అహల్యాభాయి పరిపాలనలో ప్రజలంతా సుభిక్ష వాతావరణంలో ఉండేవారని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణకు, దేవాలయల నిర్మాణ పునరుద్ధరణకు ఆమె పాటుపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

# బియ్యం పంపిణీ నిర్లక్ష్యం చేయొద్దు

- మృతి చెందిన లబ్ధిదారుల వివరాలు సేకరించాలి
- తహసీల్దార్ గోపాల్



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాల్

కందుకూరు, మే 31 : రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు నిర్లక్ష్యం చేయవద్దని, పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ గోపాల్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రేషన్ డీలర్ల సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 46 రేషన్ షాపులు ఉన్నాయని తెలిపారు. జూన్ 1 నుంచి. 30వ తేదీ వరకు జూన్, జూలై, ఆగస్టు (3) మూడు నెలలకు సంబంధించి సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయనున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీలర్లకు సూచించారు .ఈ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. తదనుగుణంగా డీలర్లు ఉదయం, సాయంత్రం తప్పక సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. మూడు నెలల కాలానికి ఒకేసారి పంపిణీ చేస్తున్నందున షాపుల్లో స్టాకు విలువలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టాకు లేని యెడల పోర్టబుల్ ద్వారా కానీ సంబంధిత అధికారులకు కానీ సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. షాపుల వద్దకు ఒకేసారి లబ్ధిదారులు వచ్చే అవకాశం ఉందని, రద్దీ దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. షాపుల్లో స్టాక్ ఉండగానే అదనంగా బియ్యం తెప్పించుకోవాలని తెలిపారు. అదేవిధంగా మృతి చెందిన వారి పేరిట చాలా కాలం నుంచి బియ్యం పంపిణీ జరుగుతోందని, అలాంటి వారిని గుర్తించి వారి కార్డు నెంబర్, మృతి చెందిన వారి పేరు వివరాలను తక్షణమే అందజేయాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్, జూనియర్ అసిస్టెంట్ రమేష్, రాజశేఖర్ రెడ్డి, సంఘం అధ్యక్షుడు తాండ్ర బాలయ్య, రాజు, దశరథ, బొక్క వీణ బాల్ రెడ్డి, విజయ ప్రభాకర్ పాల్గొన్నారు.

## రోడ్డు వెడల్పు పనులకు ప్రజలు సహకరించాలి



సహారా రెండవ గేటు మార్గంలో పర్యటించి, సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

మన్సూరాబాద్, మే 31: సహారా ఎస్టేట్స్ కాలనీ రెండవ గేటు మార్గంలో రోడ్డు వెడల్పు పనులకు ప్రజలు సహకరించాలని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. డివిజన్ పరిధి సహారా ఎస్టేట్స్ కాలనీ రెండవ గేటుకు వెళ్లే మార్గంలోని చిత్రసీమ కాలనీ, జడ్జెస్ కాలనీ, వివేకానందానగర్ కాలనీవాసులతో కలిసి ఆ ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ర్యాంపులు, గార్డెన్ నిర్మాణాల కోసం ఇష్టానుసారంగా ప్రజలు రోడ్లను ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రజల సాంఘిక బాధ్యతతో ముందుకు వచ్చి రోడ్డు ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీలవాసులు చంద్రారెడ్డి, సయ్యద్ జానీ, దామోదర్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, నరేష్, గిరి, రవికుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కార్పొరేటర్



పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాత నాయక్

వనస్థలిపురం, మే 31: ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. శనివారం డివిజన్‌లో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాల కారణంగా దోమలు ప్రబలుతాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాలు, రహదారుల పక్కను చెత్తను పడవేయవద్దన్నారు. ఇంట్లో చెత్తను డబ్బాల్లో నిల్వ ఉంచి ఆటోల్లో వేయాలని కోరారు. పారిశుధ్య నిర్వహణలో సిబ్బందికి సహకరించాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా కూడా చెత్త పోగు కాకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డారేంగుల కృష్ణ, సతీష్‌గౌడ్, మమత, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను
## విజయవంతం చేయాలి



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న కమిషనర్

బడంగ్‌పేట్, మే 31: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100 రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి కోరారు. తుక్కుగూడ పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం కమిషనర్ వాణి అధ్యక్షతన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక అభివృద్ధి, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయుట, బహిరంగ మలమూత్ర విసర్జన, వనమహోత్సవంలో భాగంగా చెట్లు నాటే కార్యక్రమం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమం ఉంటుం దన్నారు.

ఈ కార్యక్రమం జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉంటుందన్నారు.




## ఆలయ అభివృద్ధికి పాలకమండలి కృషి చేయాలి

చంపాపేట, మే 31: ఆలయ అభివృద్ధికి నూతన పాలకమండలి కృషి చేయాలని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి అన్నారు.ఇటీవల చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయపాలక మండలి కమిటీకి నియామకమైన దిండు ప్రవీణ్ గౌడ్, తోకటి కిరణ్, సింగంశెట్టి శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ, దుర్గా రెడ్డి, కుకునూరి గోపాల్ రెడ్డి, పూల నాగరాజు, కవిత, ఓరుగంటి నరేష్ కొండ్ర సంతోష్ కుమార్, బండి గారి శ్రీనివాస్ గౌడ్, అనుముల రవీందర్ రెడ్డి, ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం శనివారం ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్ లావణ్య సమక్షంలో చేపట్టారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్‌రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కి గౌడ్ హాజరై నూతన పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియామకమైన సభ్యులంతా సమష్టి నిర్ణయాలు తీసుకుని ఆలయ అభివృద్ధికి ఎంతో తోడ్పాటును అందించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, కార్పొరేటర్లు రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ పాల దినోత్సవం

ఆర్కే పురం, మే 31: తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ (విజయ డైరీ) ఆధ్వర్యంలో ఎల్బీ నగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఆదివారం ఉదయం 11 గంటలకు (నేడు) ప్రపంచ పాల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తారని గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, విజయ డైరీ ఎండీ చంద్ర శేఖర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ డైరీ డెవలప్మెంట్ ఫెడరేషన్ ద్వారా మార్కెట్లో ప్రవేశ పెట్టిన అన్ని రకాల పాల ఉత్పత్తులు, వారి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారని తెలిపారు. అనంతరం గృహ విద్యార్థులకు పాల ఉత్పత్తులను అందజేస్తారు.

## ఇద్దరి అదృశ్యం



శివాని(ఫైల్)

హయత్ నగర్, మే 31 :ఇంటి నుండి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అబ్దుల్లా పూర్ మెట్ మండలం కోహెడ గ్రామానికి చెందిన పటేల్ గూడెం శివాని(29) కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటుంది. శుక్రవారం ఉదయం 5 గంటలకు తల్లి శాంతమ్మ పని నిమిత్తం బయటికి వెళ్లింది. శాంతమ్మ పని ముగించుకొని 8:30 గంటలకు తిరిగి వచ్చే సరికి కూతురు శివాని కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు శివాని ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా దొరకలేదు. తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బూడిద రవితేజ

హయత్ నగర్ , మే 31: ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అబ్దుల్లా పూర్ మెట్టు మండలం పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధిలోని పుకట్ నగర్‌కు చెందిన బూడిద రవితేజ(27) శ్రీ జయ ల్యాబ్ సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 28న రాత్రి 11 గంటలకు పని నుండి ఇంటికి వచ్చి స్కూటీ పై ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల, స్నేహితుల వద్ద వెతికినా దొరకలేదు. తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**చెక్కును అందజేస్తున్న** మండల పరిషత్ అధికారి **సరిత**

కందుకూరు, మే 31 : ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధికారి బానోతు సరిత అన్నారు. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన పసులకడి ధనుంజయ్య కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ మృతి చెందారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాద బీమా పథకం కింద రూ .1 లక్ష ఆర్థిక సహాయం మంజూరు చేసింది. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పథకం యొక్క నగదు డిపాజిట్ పేపర్లను ఆమె ధనంజయ్య భార్య జ్యోతికి అందజేశారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ, ధనంజయ్య సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు . పేద ప్రజల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను వినియోగించుకోవాలని కోరారు.

కార్యక్రమంలో కొత్తగూడ తాజా మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డి, ఏపీఓ వీందర్ రెడ్డి, ఎంపీఓ గీత, జాతీయ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు తిరుపతిరావు, రవికుమార్, బొక్క బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

హయత్ నగర్, మే 31: రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజపూర్ గ్రామానికి చెందిన కట్ట రాజు(41) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. రోజు మాదిరిగానే ఈ నెల 29న సాయంత్రం పనులు ముగించుకొని పెద్ద అంబర్ పేట, లక్ష్మారెడ్డి పాలెం నుండి హోండా షైన్ మోటార్ సైకిల్ పై అనాజ్ పూర్‌కు బయలుదేరాడు. మార్గ మధ్యలో పెద్ద అంబర్ పేట ఫ్లైఓవర్ పై భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా గుర్తు తెలియని కారు బైక్ ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న రాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హయత్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి అతడిని తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి మేనల్లుడు భూపతి రాజ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సరస్వతి చిల్డ్రన్స్ క్లబ్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న చిలకమధుర ఉపేందర్ రెడ్డి, తదితరులు

ఆర్కే పురం, మే 31: సరస్వతి చిల్డ్రన్స్ క్లబ్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని సామాజిక సేవవేత్త చిలుకమధుర ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. లైట్ సంస్థ, లిటిల్ బుద్ధ చిల్డ్రన్ క్లబ్, సరస్వతి ట్రస్ట్, స్కై మానసిక (బుద్ధి మాద్యం) స్కూల్ డైరెక్టర్ శ్యామల ఆధ్వర్యంలో నడపబడుతున్న సరస్వతి చిల్డ్రన్ క్లబ్ బాల బాలికల వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం ఆర్కే పురం డివిజన్ వాసవీ కాలనీలోని ఆర్యవైశ్య భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్యామల చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం బాల బాలికలు చేసిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రవీందర్, వైదేహి ఆశ్రమం అధ్యక్షుడు మురళీధర్, రచయిత, సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్, డాక్టర్ సంతోషి, సర్వలక్ష్మి పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించాలి




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వ్యవసాయ శాఖ డైరెక్టర్ లక్ష్మి బాయి

సైదాబాద్ , మే 31 : రైతులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి బాయి అన్నారు. శనివారం అక్బర్ బాగ్‌లో జరిగిన హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎస్‌జీఎస్ దామోదర్ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులు, అధికారులు పాల్గొని పుష్పగుచ్ఛలను అందజేసి, శాలువాలతో సన్మానించారు.

## కిలాడీ లేడి

- మాయమాటలతో మోసాలు చేయడంలో దిట్ట
- హైకోర్ట్ న్యాయవాదినని.. న్యాయమూర్తినంటూ బిల్డప్
- హైకోర్టులో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం
- 100 మందికి పైగా అమాయకులు మోసం
- కోట్లు కొట్టేసిన మాయలాడి
- జడ్జినని సీఐని నమ్మించి వేములవాడలో ప్రత్యేక దర్శనం
- కరీంనగర్‌లో మాయలేడిని అరెస్ట్ చేసిన మధురానగర్ పోలీసులు



బితుకు ప్రసన్న రెడ్డి (నిందితురాలు)

వెంగళరావునగర్, మే 31: అమాయకులే ఆ మాయ లేడి టార్గెట్.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి కోట్ల రూపాయలు కొట్టేసింది... హైకోర్టు న్యాయవాదినని ఓసారి..న్యాయమూర్తినని మరోసారి మాయమాటలతో బోల్తా కొట్టించింది.. చివరికి కరీంనగర్‌లో ఆ కంత్రీ కిలాడిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై శివశంకర్ కథనం ప్రకారం.. అంబర్‌పేట్‌కు చెందిన బితుకు ప్రసన్న రెడ్డి ( 45 ) మోసాలు చేయడంలో ఆరితేరింది. వెంగళరావునగర్‌లో ఉండే ఎస్. జీవన్ (35) ఉద్యోగాన్వేషణలో ఉండగా.. ఆమె పరిచయమైంది. హైకోర్టు న్యాయవాదినైన తనకు చాలా మంది జడ్జీలతో పరిచయాలు ఉన్నాయని.. రూ.15 లక్షలు ఇస్తే హైకోర్టులో రికార్డు పోస్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని జీవన్‌ను నమ్మించింది. ఆమె మాటలు నమ్మిన అతను ముందుగా రూ.6.5 లక్షలు ఇచ్చా డు. మిగతా రూ.8.5 లక్షలు వసూలు చేసేందుకు శైలజారెడ్డి అనే మహిళను హైకోర్టు న్యాయమూర్తిగా పరిచయం చేసింది. ఆమె అసిస్టెంట్ ఫిరోజ్ ఖాన్ అని చెప్పి వారిద్దరిని పరిచయం చేసింది. ఆరు నెలలు గడిచినా ఉద్యోగం రాలేదు. ఈ నేపథ్యంలో రవి అనే వ్యక్తి ఫోన్‌చేసి తాను ప్రసన్న రెడ్డి చేతిలో మోసపోయానని.. ఉద్యోగం కోసం ఆమెకు రూ.4.5 లక్షలు ఇచ్చానని చెప్పాడు. ఈ క్రమంలో ప్రసన్నరెడ్డికు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ రాగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే తా ను హైకోర్టు జడ్జినంటూ వేములవాడ పోలీ స్ ఇన్‌స్పెక్టర్‌ను మాయమాటలతో బోల్తా కొట్టించి.. దర్శనానికి పోలీసు భద్రత కల్పించాలని కోరి.. ప్రత్యేక దర్శనం చేసుకుంది.

***100 మందినిపైగా మోసం..***

సుమారు 100 మందికి పైగా నిరుద్యోగులను హైకోర్టులో ఉద్యోగాల పేరిట మోసం చేసింది. ఒక్కొక్కరి నుంచి రూ. 3 నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసింది. నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు చెందినవారు ఎక్కువగా మోసపోయినట్లు పోలీసులు గుర్తించారు. తన వద్ద పనిచేసే డ్రైవర్లకు కూడా హైకోర్టులో ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు వసూలు చేసింది. ఓ మహిళ భర్తతో గొడవ పడి దేవాలయానికి వస్తే..తాను అడ్వకేట్ అని నమ్మించి విడాకులు ఇప్పిస్తానని.. హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమె నుంచి రూ.3 లక్షలు కాజేసింది. అంతేకాకుండా ఆమె ద్వారా ఆమె బంధువులు 10 మంది వద్ద ఒక్కకొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసింది. 2016లో బంజారాహిల్స్‌లో ఆమెపై చీటింగ్ కేసు నమోదైంది ఇక జగిత్యాలలో రెండు కేసులు బుక్కయ్యాయి.

***కరీంనగర్‌లో చిక్కిన కిలాడి***

బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కరీంనగర్‌లోని శ్రీ విల్లీస్‌లో కంత్రీ కిలాడి ప్రసన్న రెడ్డి మధురానగర్ పోలీసులకు చిక్కింది. మోసాల్లో ప్రమేయం ఉన్న ఆమె భర్త రామలింగారెడ్డిని సైతం పోలీసులు పట్టుకున్నారు. కిలాడి లేడి దంపతుల్ని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు.

### మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విద్యార్హతలు, ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని.. డబ్బులిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే మోసగాళ్ళ మాటలు నమ్మొద్దని మధురానగర్ ఇన్ స్పెక్టర్ ప్రభాకర్ కోరారు. మాయ మాటలతో మోసాలు చేసే ఇలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

*– ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్, మధురానగర్*

### వీర వెంకట సత్యనారాయణ ఆలయ అధ్యక్షుడిగా లింగారెడ్డి

మన్సూరాబాద్, మే 31: గడ్డి అన్నారం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం అధ్యక్షుడిగా నియమితుడైన దేవరం లింగారెడ్డి శనివారం ప్రమాణ స్వీకారాన్ని చేసి బాధ్యతలను స్వీకరించారు. దేవాలయ మాజీ అధ్యక్షుడు ఊర నరసింహ గుప్తా అధ్యక్షతన ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దేవరం లింగారెడ్డి మాట్లాడుతూ, వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చి, నియామకానికి సహకరించిన ధర్మకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసి, భక్తులకు పూర్తిస్థాయి సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.